క్లుప్తంగా

కమలమ్మ చిత్రపటానికి మంత్రి పుష్పాంజలి



జేబీఆర్ మునిరత్నం కుటుంబ సభ్యులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పిచ్చాటూరు: వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి జేబీఆర్ మునిరత్నం తల్లి కమలమ్మ చిత్రపటానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్‌తో కలిసి పుష్పాంజలి ఘటించారు. జేబీఆర్ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. జేబీఆర్ మాతృమూర్తి కమలమ్మ గత నెల 22న అనారోగ్యంతో మరణించడం విదితమే. కార్యక్రమంలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, మండల వైఎస్‌ఆర్‌సీపీ కన్వీనర్ కేటీ హరిశ్చంద్రారెడ్డి(పిచ్చాటూరు), జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపీఎం మునిశేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జగదీష్ రెడ్డి, తొప్పయ్య, సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, నాయకులు మహేష్ రెడ్డి, సోమశేఖర్, గోవిందన్, డానియేల్, రాజా, దేశప్పన్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళ చెక్ ఇస్తున్న గంగరాజన్

పిచ్చాటూరు: శ్రీ పళ్లికొండేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి చెన్నై అన్నానగర్‌కు చెందిన వ్యాపారవేత్త జీ.గంగవరాజన్ రూ.1,00,116 చెక్‌ను బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆనంద్, మునివేలు, మంజుల, ఉమాపతి పాల్గొన్నారు.

కలుజు కాలువ నిర్మించరూ!



నెరిణికండ్రిగలో కాలువలేని కలుజు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెరిణికండ్రిగ గ్రామంలోని చెరువు కలుజుకు కాలువ లేకపోవడంతో వర్షాకాలంలో కలుజు నుంచి వచ్చే వర్షపు నీరు పొలాలపై ప్రవహించి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. కలుజుకు కాలువను నిర్మించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధితశాఖ అధికారులు కలుజు కాలువను నిర్మించాల్సి ఉంది.

హనుమంతు వాహనంపై చెన్నకేశవుడు



శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరులో శ్రీకాళహస్తీశ్వరస్వామి అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో బుధవారం హనుమంతు వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గ్రామోత్సవంలో భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలశంకరశర్మ భక్తులకు కుంకుమ, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఉభయ దాతలు తమ్మన్నగారి ధర్మయ్య మొదలియార్, స్వామి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కాపిరెడ్డి విజయ్‌భాస్కర్‌రెడ్డి, బంగారు దిలీప్, సాయి, శివ, నేతాజి, నవీన్, గోపి, గున్నేరి నీలకంఠారెడ్డి, జంగాలపల్లి అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

ఆగమోక్తంగా చిన్న కొట్టాయి ఉత్సవం



స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం బుధవారం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పూజల అనంతరం ఊరేగింపుగా ఆలయ ఆవరణలోని పగడచెట్టు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ఆలయంలో ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పాఠశాలకు నూతన భవనం

- ఫేజ్–2లో ఇళ్లు మంజూరు చేయిస్తా
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హామీ
- గడప గడపకు మన ప్రభుత్వంలో వినతిపై స్పందించిన ఎమ్మెల్యే



కారిపాకంలో లబ్ధిదారులకు బుక్‌లెట్లను ఇస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: ''మా ఊర్లో అంగన్‌వాడీ స్కూలు పాడుబడిపోయింది. కొత్త బిల్డింగు కట్టించండి సారు..పిలకాయలకు మేలు చేసినట్లుంటుంది..అట్లే కొత్త గా ఇళ్లు కూడా ఇప్పించండి సార్'' అని కారిపాకం వాసులు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనమే కాకుండా ఫేజ్–2లో కొత్త ఇళ్లను మంజూరు చేయిస్తానని ప్రకటించారు. బుధవారం ఆయన కారిపాకం గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. జగనన్న పాలన ఎలా ఉందంటూ మహిళలను ప్రశ్నించారు. వివిధ పథకాల ద్వారా లక్షల రూపాయలు తమ బ్యాంకు ఖాతాలలో జమ అయ్యాయని మహిళలు సంబరంగా చెప్పారు. ఆయన మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాల ఊసేలేదని, మరలా ప్రతిపక్షనేత చంద్రబాబు కల్లబొల్లి మాటలతో ప్రజలను దగా చేసేందుకు ప్రజల చెంతకు వస్తారని, ఆయనకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. స్థానికుల వినతి సీసీ రోడ్డు మంజూరు చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడుదయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డి, జెడ్పీటీసీ వేంకటేశ్వర్లు, ఎంపీటీసీ మధుబాబు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబురెడ్డి, మాజీ సర్పంచ్ తిలక్‌బాబు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, ప్రశాంత్, సర్పంచులు ఆనంద్, రమణయ్య, కిషోర్ పాల్గొన్నారు.

పరామర్శ

ఇటీవల గోడలవారిపాళెంలో అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ మండల కన్వీనర్ జగదీష్‌రెడ్డి తల్లి సుగుణమ్మ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

నేడు పిచ్చాటూరు మండలంలో ..

పిచ్చాటూరు: మండలంలోని ఎస్‌ఎస్‌బీ పేట సచివాలయ పరిధిలో గురువారం ఉదయం 8.30 గంటల నుంచి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు.

ఆపరేషన్ చేసే వైద్యులేరీ?



మూతపడిన ఆపరేషన్ థియేటర్



నిరుపయోగంగా ఉన్న పరికరాలు

- ఇబ్బంది పడుతున్న రోగులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో కాపరేషన్‌చేసే వైద్యులు లేకపోవడంతో మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. విధిలేక ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం రోజూ సగటున 130 మంది వరకూ వస్తుంటారు. గతంలో ఆపరేషన్ చేసే వైద్యులు ఉండటంతో కుటుంబ నియంత్రణ వంటి చిన్నచిన్న ఆపరేషన్లు చేసేవారు. ఇప్పుడు 24 గంటల ఆసుపత్రి అయినా సాధారణ వైద్యసేవలు అందించే ఒకే వైద్యాధికారిణి ఉండడంతో రోగులు ఇతర ప్రాంతాల వైపు చూడాల్సి వస్తోంది.

నిరుపయోగంగా ఆపరేషన్ పరికరాలు

ఆపరేషన్ థియేటర్‌లో లక్షలాది రూపాయల విలువ చేసే వైద్య పరికరాలు తుప్పుపడుతున్నాయి అప్పుడే పుట్టిన శిశువులను ఉంచే బాక్సు పనికి రాకుండా పోతోంది.

కాన్పు కోసం ఇతర ఆసుపత్రులకు పరుగు

కాన్పుకు, ఆపరేషన్ కోసం శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రికి పరుగులు తీస్తున్నారు. ఆసుపత్రిలో కాన్పులు చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ మహిళల బాధలు వర్ణనాతీతం.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆపరేషన్లు చేసే వైద్యులను నియమించాలని పలుమార్లు జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు మండిపడుతున్నారు. అంతే కాకుండా వైద్యాధికారిణి, మరో వైద్యులు వైద్యం అందిస్తున్నారు. వీరు విధులకు రాకపోతే నర్సులే వైద్యం చేస్తున్నారు. అదనపు వైద్యులను నియమించాలని రోగులు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆపరేషన్లు చేసే వైద్యులను ప్రభుత్వాస్పత్రికి నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

క్వారీల లైసెన్స్ పునరుద్ధరణపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని బసవయ్యపాళెం సమీపంలోని క్వారీ లైసెన్స్ పునరుద్ధరణ కోసం ఎంజీఎం సంస్థలు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు అర్జీ ఇచ్చాయి. ఈ నేపథ్యంలో బుధవారం క్వారీ పరిధిలోని ప్రజల నుంచి శ్రీకాళహస్తి ఆర్డీఓ కెఎస్.రామారావు ఆధ్వర్యంలో అభిప్రాయాలు సేకరించారు. క్వారీల సమీపంలో మొక్కలు పెంచాలని, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరారు. ఆర్డీఓ మాట్లాడుతూ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు క్వారీలను పరిశీలించి నిర్వాహకులకు మరలా లైసెన్స్ పునరుద్ధరిస్తారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంజీఎం సంస్థల చైర్మన్ మల్లికార్జున నాయుడు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీఎస్పీగా భవ్య కిషోర్



రేణిగుంట: రేణిగుంట డీఎస్పీగా ఎస్.భవ్య కిషోర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సత్య సాయి జిల్లా కదిరి నుంచి ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆమె మాట్లాడుతూ, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం, రేణిగుంట రైల్వే జంక్షన్ వంటి వీఐపీ తాకిడి ఉన్న ఈ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. సబ్ డివిజన్ పరిధిలో ప్రధానంగా మహిళలు, చిన్నారుల కేసులకు సంబంధించి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు సుబ్బారెడ్డి, ఆరోహణరావు, శ్రీహరి, అర్బన్ ఎస్ఐ ఈశ్వరయ్యలతో సమావేశమయ్యారు. ఆయా స్టేషన్ల పరిధిలోని కేసులపై సమీక్షించారు.

డీఎస్పీకి సన్మానం

డీఎస్పీ భవ్య కిషోర్‌ను బుధవారం ఆమె కార్యాలయంలో రేణిగుంట సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఉచిత వేసవి శిబిరం సద్వినియోగం చేసుకోండి

రేణిగుంట: అభయ ఫౌండేషన్ (హైదరాబాద్), ఆకాంక్ష సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్.మల్లవరం, గుత్తివారిపల్లెలో వేసవి వెన్నెల సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థుల కోసం నిర్వహించనున్నట్లు ఆకాంక్ష సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రాల రవిబాబు తెలిపారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఈ రెండు గ్రామాల్లో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. 4 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నెలపాటు ఈ క్యాంప్‌లో వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలు, డ్రాయింగ్, పెయింటింగ్, భాషా నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, నృత్యం, మ్యూజిక్, కథలు రాయడం..నైతిక విలువల పెంపు, హైందవ ధర్మం గురించి తెలుసుకోవడం..మొదలైన వాటిపై శిక్షణ ఇస్తామన్నారు. ఒక్కో సెంటర్‌లో 30–40మంది పిల్లలకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత శిక్షణ ఇస్తామని, అలాగే భోజన వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు 8790457813, 9642847693 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



మందులు అందజేస్తున్న సర్పంచ్ జయరామయ్య

ఏర్పేడు: మండలంలోని మోదుగులపాలెంలో బుధవారం సర్పంచ్ జయరామయ్య, ఏర్పేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో పలువురు జ్వరాలతో బాధపడుతున్నట్టు సర్పంచ్ ఫిర్యాదు మేరకు ఈ శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డాక్టర్ రాఘవరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ కన్యకా పరమేశ్వరి వార్షికోత్సవం



విశేషాలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి



ఆలయంలో కలశ పూజ చేస్తున్న పూజారి

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేట వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం వైభవంగా వార్షికోత్సవం నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి గంధం, తేనె, సుగంధ ద్రవ్యాలు, విభూది, పంచామృతం తదితర అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. తొలుత 108 కలశాలను ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకుని వచ్చారు. వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి తీర్థప్రసాదాలు అందజేశారు.

లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న గిడ్డయ్య

ఏర్పేడు: హౌసింగ్ లబ్ధిదారులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో త్వరితగతిన బిల్లులు చెల్లించాలని ఎంపీడీఓ గిడ్డయ్య అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, జగనన్న లేఅవుట్‌లు, స్వంతంగా పక్కా గృహాలు నిర్మాణానికి పూనుకునే లబ్ధిదారులకు ఉపాధి హామీలో 90 రోజులకు హౌసింగ్ అధికారులు ఇచ్చిన జాబితా ప్రకారం బిల్లులు చెల్లించాలన్నారు. పనుల్లో కూలీల శాతాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో ఈసీ బాలాజీరావు, ఏపీఓ దేవరి, క్షేత్ర సహాయకులు మనోహర్, రవీంద్రుడు, పట్టాభిరెడ్డి, కల్పన, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని ధర్నా

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వీయస్ పురం దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు సీపీఐ నాయకులు, దళితులతో కలసి ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కత్తి రవి, సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ మాట్లాడారు. మండలంలోని కాటూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 340, 341లోని భూమిని 20 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్నారన్నారు. రెవెన్యూ అధికారులు దళారీలతో కుమ్మక్కై దళితులకు భూపట్టాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. పలుమార్లు దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరినా పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఇప్పటికైన రెవెన్యూ అధికారులు స్పందించి పట్టాలు ఇవ్వాలని లేనిపక్షంలో కలెక్టరు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కత్తిధర్మయ్య, నాయకులు కృష్ణయ్య, పీటర్, సిద్ధయ్య, దాసు, వెంకటేష్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ ఢీ : బాలికకు తీవ్రగాయాలు

- పారిపోయిన చెన్నై మోటార్ సైక్లిస్టులు
- ఛేజింగ్ చేసి అదుపులోకి తీసుకున్న ఎస్ఐ



గాయపడిన బాలిక

పిచ్చాటూరు: విహారానికి వచ్చిన తమిళనాడు వాసుల రాష్ డ్రైవింగ్‌కు ఓ బాలిక తీవ్రంగా గాయపడింది. దీంతో పారిపోతున్న వారిని గమనించిన ఎస్ఐ సినీఫక్కీలో ఛేజింగ్ చేసి పట్టుకున్నారు. బుధవారం సాయంత్రం ఈ సంఘటన నాగలాపురం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ హనుమంతప్ప కథనం..చెన్నైలోని గిండికి చెందిన సంతోష్ (30), కార్తీక్ (33) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. కేవీపురం మండలం ఆరెలోని వాటర్‌ఫాల్స్ చూడటానికి మోటార్ సైకిల్‌పై వచ్చారు. ఫుల్‌గా ఎంజాయ్ చేశారు. తిరుగు ప్రయాణంలో మితిమీరిన వేగంతో వెళ్తూ సుబ్బానాయుడుకండ్రిగ వద్ద రోడ్డు మీద నిలబడి ఉన్న ఢిల్లీప్రియ (10)ను ఢీకొన్నారు. బాలికకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి చేరుకుంది. ప్రమాదానికి కారకులైన వారు బైక్‌తో సహా మళ్లీ వెనుకకు మరలి పారిపోయారు. ఇది గమనించిన ఎస్ఐ, హుటాహుటిన ఆ బాలికను తిరుపతికి 108లో తరలించారు. ఆ తర్వాత మరో కానిస్టేబుల్‌తో కలిసి నిందితుల బైక్‌లో ఆరు కిలోమీటర్లు వెంటాడారు. బైటకొడియంబేడు వద్ద వారిని నిలువరించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేశారు.

పడకేసిన పారిశుధ్యం



కొళాయి చుట్టూ ఉన్న మురుగునీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని భవానీ శంకరపురం గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. గ్రామంలో మురుగు కాలువలు లేక పోవడంతో ఇళ్ల నుంచి మురుగునీరు వీధుల్లోకి చేరి బురదమయం అవుతున్నాయి. దీంతో దోమలకు ఆవాస కేంద్రాలవుతున్నాయి. అలాగే తాగునీటి కొళాయిలకు ట్యాప్ లేకపోవడంతో నీరంతా వృధా అవుతోంది. చేతిపంపులు చెడిపోవడంతో తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారు. గ్రామ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. మండల స్థాయి అధికారులు గ్రామం వైపు చూసిన దాఖలాలు లేవు. ఇకనైనా సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇద్దరు కుమారులతో తల్లి అదృశ్యం



సంధ్య(ఫైల్)



నూతనకుమార్(ఫైల్)



సోమిత్ సాయి

ఏర్పేడు: మండలంలోని ముసలిపేడు బీసీ కాలనీలో తల్లి, ఇద్దరు కుమారులు అదృశ్యంపై బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు అందింది. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం..తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా, ఊత్తుకోట మండలం పొండవాకం గ్రామానికి చెందిన సంధ్య(25)తో ఏర్పేడు మండలం ముసలిపేడు బీసీ కాలనీకి చెందిన నరేంద్రకు వివాహమైంది. దంపతులకు నూతనకుమార్(8), సోమిత్‌సాయి(1) కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో ఈ నెల1న ముసలిపేడు బీసీ కాలనీ నుంచి తాను పుట్టింటికి బయల్దేరుతున్నట్టు తండ్రి సంజీవకుమార్‌కు ఫోన్‌లో సంధ్య తెలిపింది. అదే రోజు రాత్రి 9 గంటలు దాటినా కుమార్తె చేరుకోకపోవడంతో పలుచోట్ల గాలించారు. అయినా వారి ఆచూకీ లభించకపోవడంతో సంజీవకుమార్ బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. వారి ఆచూకీ తెలిసిన వ్యక్తులు 9440900729 ఫోన్ నంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

బాధ్యతలు స్వీకరించిన జడ్జిలు

తిరుపతి లీగల్ : తిరుపతికి బదిలీపై వచ్చిన జూనియర్ సివిల్ జడ్జిలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం నుంచి బి.వాణిశ్రీ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గా, అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి ఎం.సంధ్యారాణి తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వచ్చారు. అలాగే, రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా ఎస్.శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు.

రావణేశ్వర వాహనంపై అగస్తీశ్వరుడు



రావణేశ్వర వాహనంపై అగస్తీశ్వరస్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్తీశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సాలలో బుధవారం రాత్రి రావణాసురుడిని వాహనంగా చేసుకుని అగస్తీశ్వరస్వామి మేళ తాళాలు, భక్తుల కోలాటాల నడుమ విహరిస్తూ అనుగ్రహించారు. తొలుత ఉదయం అర్చకులు నిత్యకైంకర్యాలను పూర్తి చేశారు. తిరుచ్చి వాహనంపై శివగామీ సమేతుడైన నటరాజస్వామి గ్రామోత్సవం విహరించారు. హారతులను అందుకున్నారు. స్థానిక ఆలయాల ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకల్, జమేదార్ విజయకుమార్ పర్యవేక్షించారు. ఉత్సవాలలో చివరి రోజైన గురువారం ఉదయం ఆలయంలో త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.

నేడు లక్ష్మీనరసింహస్వామి జయంతి

శ్రీకాళహస్తి: భక్తకన్నప్ప కొండపై ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జయంతి వేడుకలను గురువారం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సాగర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

శాస్త్రోక్తంగా ప్రదోష నందిసేవ



సిద్ధిరాజుకండ్రిగలో నందీశ్వరునికి ప్రదోష పూజలు



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నందిసేవ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం శాస్త్రోక్తంగా ప్రదోష నందిసేవ నిర్వహించారు. తొలుత ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాల అనంతరం విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల, మేళతాళాల నడుమ స్వామి అమ్మవార్లను నందిపై అధిష్టింపజేశారు. ఆలయ ప్రాకారంలో ప్రదోష నందిసేవ నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: త్రయోదశి పురస్కరించుకుని బుధవారం నాగలాపురం మండలం సురుటుపల్లె శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో నందీశ్వరునికి భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు చేశారు. ఆలయంలోని స్వయంభు శ్రీ వాల్మీకేశ్వరస్వామికి అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి పాలు, పెరుగు, కొబ్బరినీళ్లు, చందనం, వివిద రకాల సుగంధ ద్రవ్యాలతో సాయంత్రం అభిషేకించారు. అనంతరం నందీశ్వరుని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ రకాల పండ్లను నైవేద్యంగా సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాలు నడుమ నందీశ్వరునికి కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు. అంతకు ముందు ఆలయంలోని దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు చేసి అందంగా అలంకరించారు. చివరగా శివపార్వతుల ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

సోమనాథేశ్వరాలయంలో..

మండలంలో సిద్ధిరాజుకండ్రిగలోని శ్రీ పార్వతీ సమేత సోమనాథేశ్వరాలయంలో నందీశ్వరునికి బుధవారం ప్రదోష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.